సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 19 । మార్చి । 2023



కల్యాణం.. కమనీయం

అశేష భక్తజనుల నడుమ శ్రీనివాస కాలనీ గుట్టపై శ్రీ స్వామివారి కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. 8లో



స్పీడ్‌పోస్టులో 'భద్రాద్రి' తలంబ్రాలు

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి తలంబ్రాలను తపాలా శాఖ స్పీడ్ పోస్టు ద్వారా భక్తులకు అందించనుంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
30° / 20°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. చలి గాలులు కూడా వీస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఇల్లెందు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు..



మాట్లాడుతున్న ఉన్నతవిద్య జేడీ యాదగిరి

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు త్వరలో నూతన కోర్సులు మంజూరు చేయనున్నట్లు ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డి.టి.చారి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం వారు సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కళాశాల ఇటీవల న్యాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించడం అభినందనీయమని అన్నారు. సీడీపీసీ సభ్యుడు పులిగళ్ల మాధవరావు మాట్లాడుతూ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు సంయుక్తంగా కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచేలా కృషి చేయాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, అధ్యాపకులు చెంచురత్నయ్య, ఇంద్రాణి, పిచ్చయ్య, కిరణ్‌కుమార్, సురేంద్రకుమార్, శేఖర్, రాజు, సరిత, ఈశ్వర్ పాల్గొన్నారు.

'లీకేజీ'పై బీజేపీ ఆందోళన



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రూప్–1 ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేస్తే కొడుకైనా, కూతురైనా, అల్లుడైనా క్షమించేదిలేదని సీఎం కేసీఆర్ గతంలో చెప్పినట్లు తన కొడుకు కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు. సీఎం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు యడ్లపల్లి శ్రీనివాసకుమార్, బాలగాని గోపీకృష్ణ, పున్నం భిక్షపతి, నరేంద్రబాబు, పానిశెట్టి వెంకటేశ్వర్లు, భీమల్‌కుమార్ జైన్, గుగులోత్ రామచంద్ర నాయక్, ముసుకు శ్రీనివాసరెడ్డి, సన్నపతి మురళీకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీసీసీలో బియ్యం నిల్వలపై విచారణ?

పాల్వంచరూరల్: పాల్వంచలోని జీసీసీ గోదాంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం విచారణ నిర్వహించినట్లు సమాచారం. బియ్యం నిల్వలను పరిశీలించినట్లు తెలిసింది. మండలంలోని లక్ష్మీదేవిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను శుక్రవారం కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేసి, విద్యార్థుల భోజనానికి దొడ్డు బియ్యం ఎందుకు వినియోగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. సన్న బియ్యంతో భోజనం పెట్టాలని చెప్పగా.. తమకు ఈ నెలలో దొడ్డు బియ్యమే వచ్చాయని ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల అధికారులు జీసీసీ గోదామును సందర్శించి సన్న, దొడ్డు బియ్యం నిల్వలపై ఆరా తీసినట్లు సమాచారం. గురుకులానికి ఇక నుంచి పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తామని సదరు అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

వేసిన తాళం వేసినట్టే..

- జనవరి 12న ప్రారంభమైన తెలంగాణ భవన్
- ఆ తర్వాత కన్నెత్తి చూడని నేతలు.. కానరాని సందడి
- ఇప్పటివరకు ఒక్క సమావేశం జరగని వైనం
- ఖమ్మం జిల్లాలో నేటి నుంచి ఆత్మీయ సమావేశాలు
- భద్రాద్రి జిల్లాలో మాత్రం మొదలుకాని కార్యాచరణ





కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం (ఇన్‌సెట్)తాళం తీయని గేటు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రారంభమై రెండు నెలలు గడిచినా భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో జోష్ కనిపించడం లేదు. ఎన్నికల ఏడాదిలోకి వచ్చినా ఇప్పటికీ ఇక్కడ కార్యకలాపాలు ఊపందుకోలేదు. జిల్లాలో ఉన్న నేతలు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.

సందడి లేదు..

ముఖ్యమంత్రి కేసీఆర్ గత జనవరి 12న తెలంగాణ భవన్ పేరుతో పార్టీ జిల్లా కార్యాలయాన్ని కొత్తగూడెంలో లాంఛనంగా ప్రారంభించారు. ఆఫీస్ బేరర్లకు గదులు, సమావేశ మందిరం, చక్కని లాన్ తదితర సౌకర్యాలు ఇక్కడున్నాయి. గడిచిన రెండు నెలలుగా పార్టీ తరఫున ఏ ఒక్క కార్యక్రమమూ ఇక్కడ జరగలేదు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తన నియోజకవర్గంలోని మణుగూరులో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కేంద్రంగా పని చేసుకుంటూ పోతున్నారు. ఇతర ఎమ్మెల్యేలు సైతం తమ క్యాంపు కార్యాలయాలు వేదికగానే ప్రభుత్వ, పార్టీ పరమైన కార్యక్రమాలు నిర్వహిస్తు వస్తున్నారు. సమష్టిగా జిల్లా కార్యాలయం వేదికగా ఏ ఒక్క కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ నేతలు నిర్వహించలేదు. ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో అసమ్మతి చెలరేగినా పార్టీ కార్యాలయం వేదికగా ఎటువంటి యాక్షన్ ప్లాన్ కనిపించలేదు. ఇక పార్టీకి అనుబంధంగా పని చేసే కార్మిక, విద్యార్థి, యువ, మహిళా విభాగాలు సైతం పార్టీ కార్యాలయానికి రావడం లేదు. దీంతో గడిచిన 65 రోజులుగా తెలంగాణ భవన్ గేటుకు తాళం వేసి ఉంటోంది. కేవలం వాచ్‌మన్ రోజువారీగా వచ్చిపోతున్నాడు, స్వీపర్లు కార్యాలయం ప్రాంగణం ఊడ్చి శుభ్రంగా ఉంచుతున్నారు. ఇంతకు మించి ఇక్కడ మరేమి జరగడం లేదు.

సీఎం సూచించినా..

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని, అందుకు తగ్గట్టుగా నాయకులు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను సన్నద్ధం చేసి ప్రజల్లోకి వెళ్లాలంటూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 10న ప్రగతి భవన్ వేదికగా దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి ప్రతీ పది గ్రామాలు యూనిట్‌గా ఆత్మీయ సమావేశాలు, గ్రామాల్లో వార్డుల వారీగా పాదయాత్రలు, మున్సిపాలిటీల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించాలని సూచనలు చేశారు. వీటికి ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవడంతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లను ఆహ్వానించాలన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని చెట్ల సమావేశాల సన్నాహకాలు ఊపందుకున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో ఆదివారం తొలి సమావేశం జరగనుంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులను సమావేశపరిచి ఆత్మీయ సమ్మేళనాల కార్యాచరణ రూపొందించే దిశగా ఇంత వరకు అడుగులు పడలేదు. పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు అంతా ఎవరికి వారే అన్నట్టుగా పని చేస్తున్నారనే వాదన పార్టీ శ్రేణుల నుంచే వస్తోంది.

బలగం ఉన్నా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓడిపోయారు. అయితే ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు గులాబీ కండువా కప్పుకోవడం, సైకిల్ గుర్తుపై గెలిచిన అభ్యర్థి ఆ తర్వాత కారు పార్టీలో చేరడంతో ఒక్కసారిగా జిల్లాలో పార్టీకి బలం పెరిగింది. ఆ తర్వాత జిల్లా పరిషత్ చైర్మన్, రెండు మున్సిపాలిటీలు, అత్యధిక జెడ్పీటీసీలు, ఎంపీపీలు బీఆర్‌ఎస్ ఖాతాలోకి చేరాయి. దీంతో ఐదేళ్లు కాకముందే జిల్లాలో బీఆర్‌ఎస్‌కు భారీగా బలగం పెరిగింది. పార్టీ పరంగా లెక్కకు మిక్కిలిగా నాయకులు, కార్యకర్తలు , అభిమానులు కనిపిస్తున్నారు. అయితే వారందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. కేసీఆర్ పుట్టిన రోజు, ఎమ్మెల్సీ కవిత విచారణ తదితర అంశాల్లో ఈ అంశం బయటపడుతూనే వస్తోందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు..

- కంట్రోల్ రూం, అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు
- తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక సిబ్బంది
- గోదావరి వద్ద నాటు పడవలు, గజ ఈతగాళ్లు..
- శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకల సమీక్షలో కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్



సమీక్ష సమావేశానికి హాజరైన అధికారులు

భద్రాచలం: ఈ నెల 30, 31న జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం మహోత్సవాలను భక్తులు వీక్షించేలా తగిన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణ వేడుక నిర్వహించనున్న మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించి, పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. వేడుకల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, టికెట్లు, వసతి గృహాల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామని వివరించారు. ఉత్సవ రోజుల్లో మాంసం, మద్యం విక్రయాల నిషేధం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సెక్టార్లలో ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బంది..

సెక్టార్లలో ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు పట్టణాన్ని 25 జోన్లుగా విభజించి, ప్రతి జోనుకు ఒక ఎంపీఓతో పాటు నలుగురు కార్యదర్శులను నియమించాలని డీపీఓను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743– 232444 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సరఫరాకు పట్టణంలో 200 కుళాయిలు ఏర్పాటు చేస్తామని, పర్యవేక్షణకు 30 మంది ఏఈలు, తాగునీటి పరీక్షల నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమిచనున్నట్లు తెలిపారు. అగ్నిమాపక వాహనాలను, నివారణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని అగ్నిమాపక అధికారిని ఆదేశించారు.

ఐదు చోట్ల పార్కింగ్..

భక్తులు వాహనాలు పార్కింగ్ కోసం 5 ప్రాంతాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లోనే భక్తులు వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. వేడుకల అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వంతెనపై వాహనాలు ఆగిపోతే తక్షణమే తరలించేందుకు వీలుగా క్రేన్లను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నాటు పడవలను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా...

స్వామివారు కల్యాణ మండపానికి వచ్చేటప్పుడు భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. 24 గంటలపాటు పనిచేసేలా అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 20 బెడ్లను సిద్ధంగా ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, ఏర్పాట్లు పరిశీలించి విద్యుత్ అధికారులు ధ్రువీకరణ నివేదిక అందచేయాలని తెలిపారు. హోటళ్లలో ఆహార పదార్థాలకు నిర్ణీత ధరలను నిర్దేశించాలని, ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు. హోటళ్లను పరిశీలించి ఖాళీ గదుల వివరాలు అందజేయాలని చెప్పారు.

తలంబ్రాలు అందేలా చూడాలి

భక్తులందరికీ తలంబ్రాలు అందించాలని, పంపిణీలో ఇబ్బందులు రాకుండా 70 కౌంటర్లు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీపీఆర్వోను ఆదేశించారు. చిన్నారులు తప్పిపోయిన సందర్భంలో గుర్తించేందుకు వీలుగా జేబులో చిరునామాతో పాటు సెల్ ఫోన్ నంబర్లు రాసి పెట్టాలని భక్తులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, దేవస్థానం ఈఓ రమాదేవి, డీఆర్‌ఓ అశోక్ చక్రవర్తి, భద్రాచలం ఆర్డీఓ రత్న కళ్యాణి, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు మంత్రి అజయ్ సమీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం కార్యక్రమాలపై ఈ నెల 20న ఉదయం 10 గంటలకు భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ అనుదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమగ్ర కార్యాచరణతో హాజరు కావాలని సూచించారు.

కొత్త కమిటీలే కొనసాగుతాయి..

డీసీసీ ప్రెసిడెంట్ పొదెం వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వీరయ్య

ములకలపల్లి: అశ్వారావుపేట నియోజకవర్గంలోని మండలాల్లో ఇటీవల ప్రకటించిన నూతన కమిటీలే కొనసాగుతాయని, ఈవిషయంలో అపోహలకు తావులేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య స్పష్టం చేశారు. మండలంలోని మాధారంలో జెడ్పీటీసీ సున్నం నాగమణితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాత కమిటీలు పూర్తిగా రద్దు కాగా, నూతన కమిటీలను ప్రకటించి, అధిష్టానానికి అనుమతి కోసం లేఖ రాశామని.. అనుమతి వచ్చే వరకు నూతన కమిటీలను పరిగణించాలని తెలిపారు. ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల అధ్యక్షులుగా తాండ్ర ప్రభాకర్‌రావు, తుమ్మ రాంబాబు, మద్దిశెట్టి సత్యప్రసాద్, దారం గోవిందరెడ్డి, వనమా గాంధీ కొనసాగుతారని స్పష్టం చేశారు. కాగా, మాజీ అధ్యక్షులు నేటికీ తామే పార్టీ బాధ్యులుగా చెప్పుకోవడం సరికాదని, కొందరు పార్టీని భ్రష్టుపట్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. సేవ్ కాంగ్రెస్ అంటూ ములకలపల్లి మాజీ అధ్యక్షుడు పేటేటి నర్సింహారావు కార్యక్రమాలు చేపడుతుండడం సరికాదని సూచించారు. ఇలాంటి వారిపై ఏఐసీసీ, పీసీసీ అనుమతి మేరకు చర్యలు తీసుకుంటామని పొదెం తెలిపారు. ఏదిఏమైనా రానున్న ఎన్నికల్లో తెలంగాణాలో కాంగ్రెస్ విజయం తథ్యమని, జిల్లాలోని ఐదు స్థానాల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాయకులు దారబోయిన రమేశ్, ఖాదర్‌బాబా, అంజుం, పుష్పాల హనుమంతు, పాలకుర్తి రత్నభూషణం, అచ్చెన వెంకటేశ్వర్లు, బజ్జూరి కృష్ణారావు, సుమిత్, పిడియాల వెంకటేశ్వర్లు, బూరుగుపల్లి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలో ఇన్నాళ్లు తాండ్ర ప్రభాకర్‌రావు, పేటేటి నర్సింహారావు ఎవరికి వారే మండల అధ్యక్షులుగా చెప్పుకుంటుండగా, ప్రభాకర్‌రావు పేరును వీరయ్య ప్రకటించడంతో పేటేటి వర్గీయులెవరూ సమావేశానికి హాజరు కాలేదు.

రేపటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం వేడుకల నిర్వహణపై రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం భద్రాచలం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీఆర్వో అశోకచక్రవరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాకర్ల పంచాయతీకి జాతీయ అవార్డు



కాకర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జాతీయస్థాయిలో హెల్దీ గ్రామ పంచాయతీ అవార్డుకు ఎంపికైంది. గ్రామంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్యసేవలు, మాతా శిశు మరణాలు తగ్గించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, పారిశుద్ధ్యం, బహిరంగ మలవిసర్జన రహిత(ఓడీఎఫ్) గ్రామం తదితర అంశాలను పరిశీలించగా, ఉత్తమ ఆరోగ్యకర పంచాయతీగా నిలిచింది. సర్పంచ్ బానోత్ రమాదేవి, పంచాయతీ సెక్రటరీ బి.నానిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పొన్నెకంటి సతీష్‌కుమార్ తదితరుల కృషితో 98 శాతం పాయింట్లు సాధించింది. పంచాయతీలో 863 కుటుంబాలు ఉండగా, జనాభా 3,146 మంది ఉన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీఓ డి.రామారావు తెలిపారు.

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస తీర్మానం సమావేశం తర్వాత బయటకు వస్తున్న డైరెక్టర్లు



సమావేశ మందిరం వద్ద సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి

కేసు కోర్టులో ఉండటంతో వివరాలు వెల్లడించని అధికారులు

జూలూరుపాడు: జూలూరుపాడు సహకార సంఘం చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు డైరెక్టర్లతో శనివారం డీసీఓ వెంకటేశ్వరరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ గత నెల 22న 9 మంది డైరెక్టర్లు జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్(డీసీఓ) ఎస్.వెంకటేశ్వరరావుకు లిఖిత పూర్వకంగా కోరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సహకారం సంఘం అధికారులు శనివారం అవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించగా, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పోలీసు రక్షణ నడుమ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ సహకార సంఘం కార్యాలయానికి 10 మంది డైరెక్టర్లను తీసుకునివచ్చారు. సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా సమావేశానికి 12 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. ఒక సభ్యురాలు గైర్హాజరయ్యారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 10 మంది డైరెక్టర్లు, వ్యతిరేకంగా సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డితోపాటు మరో డైరెక్టర్ సంతకాలు చేసినట్లు డైరెక్టర్లు తెలిపారు. కాగా జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకటేశ్వరరావును మీడియా వివరాలు అడగగా.. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున వివరాలను బయటకు వెల్లడించలేమని, కోర్టు సూచనల ప్రకారమే తదుపరి నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. కొత్తగూడెం డీఎస్పీ ఎస్కె అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ తదితరులు బందోబస్తు నిర్వహించారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లో పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

యూనిఫాం క్లాత్ వచ్చేసింది..

- జిల్లాకు 3,23,855.15 మీటర్ల బట్ట పంపిణీ
- మండల కేంద్రాల నుంచి హెచ్‌ఎంలకు అందిస్తున్న అధికారులు
- వచ్చే విద్యాసంవత్సరం పునఃప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం



నూతన యూనిఫాం మోడల్ డ్రెస్‌లో విద్యార్థులు



యూనిఫాం క్లాత్ అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాం క్లాత్ ముందస్తుగానే జిల్లాకు చేరుకుంది. జిల్లా విద్యాశాఖ అధికారులు మండలాలకు పంపించారు. ఈ సారి ప్రైవేటుకు ధీటుగా ఆకర్షణీయమైన యూనిఫామ్‌ను విద్యార్థులకు అందించనున్నారు. క్లాత్‌ను పాఠశాలలకు పంపించి, హెచ్‌ఎం ఆధ్వర్యంలో కుట్టించి పాఠశాలల పునఃప్రారంభం రోజునే అందజేయనున్నారు.

విద్యార్థులు ఇబ్బంది పడకుండా..

2023–24 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే యూనిఫామ్‌లను అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత విద్యాసంవతర్సంలో చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మారాయి. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. ఈ ఏడాది నుంచి ఒకటో తరగతి నుంచి ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు. ఈ క్రమంలో ఆకర్షణీయమైన యూనిఫాం కూడా ముందస్తుగా అందించబోతున్న నేపథ్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య కూడా భారీగా పెరగనుంది. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ కూడా తయారు చేసి అమలు చేయనున్నారు.

3,23,855.15 మీటర్ల క్లాత్

జిల్లా వ్యాప్తంగా 1,316 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం బాలురు 35,732, బాలికలు 36,246.. మొత్తం 71,978 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి యూనిఫాం కుట్టించేందుకు 3,23,855.15 మీటర్ల క్లాత్‌ను ప్రభుత్వం జిల్లాకు పంపించింది. ఆ క్లాత్‌ను ఇప్పటికే మండల కేంద్రాలకు పంపగా, అక్కడి నుంచి పాఠశాలల పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం ఏకరూప దుస్తులు ఆకర్షణీయంగా కుట్టించేందుకు ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలను తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు.

అన్ని మండలాలకు పంపించాం



జిల్లాలోని అన్ని మండలాలకు విద్యార్థుల యూనిఫాం క్లాత్ చేరుకుంది. మండల కేంద్రాల నుంచి అన్ని పాఠశాలలకు రెండు రోజుల్లో సరఫరా పూర్తి అవుతుంది. వేసవి చివరి నాటికి విద్యార్థుల కొలతలు తీసుకుని దర్జీల వద్ద కుట్టించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– ఎస్.కె.సైదులు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి

ప్రభుత్వ బడులు ప్రగతి బాట..



మన ఊరు–మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుతున్నాయి. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలతో పాఠశాలలు ప్రగతి బాటన నడుస్తున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల యూనిఫాం ఆకర్షణీయంగా ఉండనుంది.

– ఇ.సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

పోడు కొడుతున్న ముగ్గురిపై కేసు నమోదు



పోడు కొట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ నాగశివప్రసాద్

చండ్రుగొండ : అటవీప్రాంతంలో పోడు కొడుతున్న వారిపై కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని రావికంపాడు గ్రామ శివారులో శనివారం చేటు చేసుకుంది. చండ్రుగొండ రేంజ్ ఇన్‌చార్జ్ నాగశివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రావికంపాడు గ్రామశివారులోని రిజర్వ్ ఫారెస్టులో శనివారం ముగ్గురు వ్యక్తులు పోడు కొడుతున్నారు. విషయం తెలుసుకున్న రేంజర్ నాగశివప్రసాద్ రావికంపాడు ఫారెస్ట్ బీట్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించి పోడు కొడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

కారు అదుపు తప్పి పలువురికి గాయాలు



ఘటనా స్థలం వద్ద క్షతగాత్రులు

కరకగూడెం: మొక్కులు తీర్చుకుని ఇంటికి తిరిగి వస్తున్న భక్తులకు చేదు అనుభవం ఎదురైంది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి కల్వర్టులో పడిపోయి పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని రాళ్లవాగు వద్ద శనివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను ప్రత్యక్ష సాక్షులు ఇలా తెలిపారు. నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన ఏడుగు రు ఆంజనేయ స్వామి భక్తులు భద్రాచలంలో మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లి కారులో తిరు గు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో మండలంలోని రాళ్లవాగు వద్దకు రాగానే వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి కల్వర్టులో పడిపోయింది. దీంతో పలువురికి గాయాలు కాగా.. సురేష్ అనే భక్తుడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు క్షతగాత్రులను 108లో కరకగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుండాల: కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సాయనపల్లి గ్రామంలోని ఓ వివాహ వేడుకకు హైదరాబాద్ నుంచి నలుగురు కారులో వస్తున్నారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున సాయనపల్లి–గుండాల మధ్య అదుపుతప్పి బోల్తాకొట్టడంతో సత్యనారాయణ, రవితేజలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గుండాల ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

విద్యుదాఘాతంతో ఆంబోతు మృతి

అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతుల ధర్నా




ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

చండ్రుగొండ : మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర్ గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం ఆంబోతు మృతి చెందింది. దీంతో ఆగ్రహించిన గ్రామానికి చెందిన రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎదుట ధర్నా నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టేకులబంజర్ గ్రామానికి చెందిన ఆంబోతు శనివారం ఉదయం గ్రామశివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించడంతోనే పాడి పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖాధికారులు బాధ్యత వహించి గ్రామానికి పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం ఆంబోతును సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

పాల్వంచరూరల్: చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో ఒకరు మృత్యువాత పడిన సంఘటన కారెగట్టులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కారెగట్టు గ్రామానికి చెందిన సర్ప నర్సింహారావు(38), మరో ముగ్గురితో కలిసి శనివారం గ్రామ సమీపంలోని రాళ్లవాగు ప్రాజెక్టు చెరువులో చేపలు పట్టేందుకు తెప్ప మీద వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడికి భార్య రాములమ్మ, కుమారుడు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

కల్యాణం.. కమనీయం..



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని తిలకిస్తున్న తహసీల్దార్ రంగాప్రసాద్, భక్తులు

గోవింద నామ స్మరణతో మార్మోగిన శ్రీనివాసగిరి

పాల్వంచ: ఆపద మొక్కుల వాడా.. అనాథ రక్షకా.. శ్రీనివాసా.. గోవిందా.. గోవిందా.. అంటూ చేసిన గోవింద నామస్మరణతో పట్టణంలోని శ్రీనివాసగిరి మారుమ్రోగింది. అశేష భక్త జన సందోహం నడుమ శ్రీనివాస కాలనీ గుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తహసీల్దార్ రంగా ప్రసాద్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించగా.. గర్భగుడి నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో మేళతాళాలతో కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి కల్యాణాన్ని వనపర్తికి చెందిన సౌమిత్రి రామాచార్యులు, హైదరాబాద్‌కు చెందిన హరి చార్యులు, తోలేటి నగేశ్ శర్మ, ఆరుట్ల ఫణిరాజా చార్యులు మంత్రోచ్చరణల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు. పాదాల మండపం వద్ద ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణలు పూజలు చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులకు సౌకర్యాలు..

భక్తుల సౌకర్యార్థం గుట్టపై తాటి ఆకులతో చలువ పందిళ్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా తీర్థ ప్రసాదాలు, అక్షింతల పంపిణీ, మంచి నీటి వసతులను ఆలయ కమిటీ నిర్వాహకులు కల్పించారు. గుట్టపైకి వచ్చే వారికి మెడికల్ కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పాల్వంచ ఆధ్వర్యాన మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఎస్, గ్లూకోజ్, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఔషధ తనిఖీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌రావు, అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణాచారి, స్వరూప్, రవి, భాను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాదరావు

నడిరోడ్డుపై ఆగిన ఆర్టీసీ బస్సు..

రన్నింగ్ రాడ్ ఊడడంతో ఆగిన వైనం



రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

చుంచుపల్లి: ఆర్టీసీలో డొక్కు బస్సులు తిప్పుతున్నారనే దానికి నిదర్శనం ఈ సంఘటన. ప్రయాణికుల శ్రేయస్సును గాలికి వదిలేసిన ఆర్టీసీ అధికారులు కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శనివారం రాత్రి మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొత్తగూడెం పట్టణం గణేష్ టెంపుల్ వద్దకు రాగానే ప్రధాన రహదారిపై గ్యాస్ పైప్ జాయింట్ రాడ్ ఒక్కసారిగా ఊడి పడింది. దీంతో బస్సు నడిరోడ్డుపై నిలిచిపోయింది. చేసేదేమీ లేక ఆగిన బస్సులో ఉన్న ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు. దాదాపు గంటసేపు ప్రధాన రహదారి మధ్యలో బస్సు నిలిచిపోవడంతో అటుగా వచ్చే వందలాది మంది వాహనదారులకు ఇబ్బంది కలిగింది. మెకానిక్ కోసం ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ఎదురుచూస్తూ కనిపించారు.

వైద్యుల నిర్లక్ష్యం ఖరీదు.. ఓ ప్రాణం!

- ఆపరేషన్ వికటించి గిరిజన మహిళ మృతి..?
- నష్టపరిహారంతో సెటిల్ చేసినట్లు ప్రచారం



చికిత్సకు ముందు ప్రైవేట్ ఆస్పత్రిలో మృతురాలు గంగమ్మ



మృతురాలి కుమారుడు, కుమార్తె

భద్రాచలం: ఒదినా.. అక్కా... చిన్న గడ్డ ఆపరేషన్‌ను చేయించుకోవటానికి భద్రాచలం వెళ్తున్నా.. అయిపోగానే ఇంటికి వస్తా.. అని ఇంటి చుట్టు పక్కల వారికి చెప్పి వెళ్లిన ఓ గిరిజన వివాహిత నిర్జీవంగా ఇంటికి తిరిగి వచ్చింది. పరీక్షలు అయిపోగానే ఇంటికి వెళ్లి అమ్మ గోరు ముద్దలు తిందామని ఆశపడిన చిన్నారులిద్దరికీ.. ఆస్పత్రిలో అమ్మ 'విగత జీవి'గా కనిపించింది. కడదాకా తోడుంటానని బాస చేసి భర్తను ఒంటరి వాడిని చేసి వెళ్లిపోయింది. వైద్యుడి తప్పిదమో లేదా దేవుడికి దయ లేదో లేదా రోగం ముదిరిందో.. కారణమేదైనా చిన్నారులిద్దరు తల్లిలేని పిల్లలు అయ్యారు. ఈ విచారకరమైన సంఘటన శనివారం అశ్వాపురం మండలం మామిళ్లవాయి గూడెంలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళ్తే.. మడకం గంగమ్మ(34) గొంతు వాపుతో బాధపడుతుండడంతో బస్టాండ్ ఎదురుగా నూతనంగా ప్రారంభించిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. పరిశీలించిన వైద్యులు థైరాయిడ్ సమస్య ఉందని, దీనికి శస్త్రచికిత్స అవసరమని భర్త మడకం కృష్ణకు తెలపగా శుక్రవారం మధ్యాహ్నం ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం తెల్లవారుజామున శస్త్రచికిత్సను ప్రారంభించిన కొద్ది సేపటికే వైద్యులు గంగమ్మకు గుండెనొప్పి వచ్చిందని, ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందించాలని మృతురాలి కుటుంబీలకు తెలిపి హడావుడిగా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గంగమ్మ మరణించిందని ఆమె భర్తకు తెలిపారు. హాస్టల్ నుంచి వచ్చిన కుమారుడు, కుమార్తెలు తల్లి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే...

చిన్న గడ్డ చికిత్సకు వస్తే వైద్యుల నిర్లక్ష్యంతోనే గంగమ్మ ప్రాణాలు పోయాయని మృతురాలి భర్త కృష్ణ, సోదరుడు పద్దం కార్తీక్, సోదరి కుంజా శిరీషలు ఏరియా ఆస్పత్రి వద్ద విలేకరులకు తెలిపారు. గుండెకు సంబంధించిన ఎటువంటి సమస్యలు లేవని, నిర్లక్ష్యపూరిత వైద్యంతోనే గంగమ్మ చనిపోయిందని ఆరోపించారు. అనంతరం ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం కొంత మంది పెద్ద మనుషుల మధ్యర్తిత్వంతో సెటిల్‌మెంట్ చేసినట్లుగా తెలిసింది. నష్టపరిహారం చెల్లిస్తామని మృతురాలి కుటుంబసభ్యులకు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని కుటుంబీకులు మామిళ్లవాయి గ్రామానికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కార్డియాక్ అరెస్టుతోనే మా వద్దకు...

మడకం గంగమ్మ మా వద్దకు వచ్చే సరికి కార్డియాక్ అరెస్టుతోనే వచ్చింది. సీపీఆర్ విధానంతో ఆమెను బతికించటానికి ప్రయత్నించాం. అయినా ఫలితం లేకపోయింది. నియమ నిబంధనల ప్రకారం మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశాం.

– డాక్టర్ రామకృష్ణ, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

సుజాతనగర్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఐదుగురిపై స్థానిక పోలీస్ స్టేషన్ కేసు నమోదైంది. ఎస్సై తిరుపతిరావు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన భూక్యా నందినీకి, ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం హిమాంనగర్‌కు చెందిన భూక్యా గోపితో గత రెండేళ్ల క్రితం వివాహమైంది. కట్నం కింద రూ.3.50 లక్షల నగదుతో పాటు సుమారు రూ.2 లక్షలతో ఇంటి సామన్లు కొనిచ్చారు. గత కొంత కాలంగా అదనపు కట్నం తేవాలని, అక్రమ సంబంధాలు అంటగడుతూ భర్త శివతో పాటు కుటుంబసభ్యులు శారీరకంగా ఆమెను వేధిస్తున్నారు. దీంతో నందిని భర్తతో పాటు అత్త తార, మామ భీమా, మరిది గణేష్, శివ నాయనమ్మ ద్వాలీ అనే ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చర్లలో మావోల కలకలం..

- ఈ నెల 23ను సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరపాలని పిలుపు
- మావోయిస్టు పార్టీ పేరిట వెలసిన కరపత్రాలు, బ్యానర్లు



కుదునూరు సమీపంలో వెలసిన మావోయిస్టు పార్టీ బ్యానర్

చర్ల: చర్ల మండలంలో మావోయిస్టులు ప్రధాన రహదారిపై పలు చోట్ల కరపత్రాలు విడవడంతో పాటు బ్యానర్ కట్టి కలకలం సృష్టించారు. వివరాలిలా.. మండలంలోని కుదునూరు–ఆర్ కొత్తగూడెం, దానవాయిపేట–చింతగుప్ప గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదార్లపై శనివారం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరిట కరపత్రాలు, బ్యానర్ వెలిశాయి. అందులో ఈనెల 23వ తేదీన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 91వ అమరత్వ దినాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేకదినంగా జరపాలని రాసి ఉంది. దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల ఉరితీతకు గురైన కామ్రేడ్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అమరత్వం సామ్రాజ్య వ్యతిరేక చైతన్యానికి ఒక ప్రతీక అని పార్టీ పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. కాగా, మధ్యాహ్నం ఆయా గ్రామాల్లో వెలసిన బ్యానర్, కరపత్రాలను పోలీసులు తొలగించారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మంలీగల్: లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే త్వరగా కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాస రావు తెలిపారు. ఖమ్మం కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన బ్యాంక్ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రతీ మూడు నెలల కోసారి నిర్వహించే లోక్ అదాలత్‌లో ఈసారి బ్యాంకు సంబంధిత కేసులను విచారించినట్లు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా మాట్లాడుతూ రుణ గ్రహీతలకు వడ్డీ పూర్తిగా మాఫీ చేయడమే కాక రుణం తగ్గిస్తున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులను అభినందించారు. ఈసందర్భంగా రూ.6 లక్షలకు సంబంధించి 130 ప్రీ లిటిగేషన్లను పరిష్కరించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ, వరకట్నం, భ్రూణ హత్యల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను జిల్లా జడ్జి ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో న్యాయమూర్తులు ఆర్.డానీరూథ్, ఎస్.అమరావతి, ఎన్.శాంతిసోని, పి.మౌనిక, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొల్లపూడి రామారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం పార్థసారథి మురళి తదితరులు పాల్గొన్నారు.



నేత్రనిధి.. ఆపన్నుల పెన్నిధి

- ఖమ్మం కేంద్రంగా 23ఏళ్ల నుంచి సంస్థ కార్యకలాపాలు
- ఇప్పటివరకు వేలాది మందికి కంటి చూపు
- ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానంతో మరింత సేవ



మరణించిన వ్యక్తి కార్నియాను సేకరిస్తున్న ప్రతినిధులు



జిల్లా ఆస్పత్రిలోని ఖమ్మం నేత్రనిధి కార్యాలయం

ఖమ్మం వైద్యవిభాగం: మనిషి అవయవాల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రాముఖ్యత. అందులో అత్యంత ప్రధానమైనవి నేత్రాలు మాత్రమే. కంటి చూపు కోల్పోతే అందమైన లోకాన్ని చూసే అవకాశాన్ని కోల్పోతారు. అలాంటి అభాగ్యులు ఎందరో మన ముందు కనిపిస్తారు. అయితే, కంటి చూపు లేని వారికి, వివిధ కారణాలతో చూపు కోల్పోయిన వారికి ఖమ్మం నేత్రనిధి దారి చూపిస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా మరణించిన వారి నుండి నేత్రాల(కార్నియా)ను సేకరిస్తూ వేలాది మందికి చూపు ప్రసాదిస్తున్న ఈ సంస్థ బాధ్యులు..... ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ప్రతీరోజు 100 మందికి అన్నదానం చేస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

23ఏళ్లుగా సేవలు

ఖమ్మం నగరానికి చెందిన రాయపుడి అనంత పద్మనాభం ఆధ్వర్యాన 2000 సంవత్సరంలో ఖమ్మం నేత్రనిధి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నిరాటంకంగా ఎందరికో కంటి చూపును ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అనతి కాలంలోనే జిల్లా వ్యాప్తంగానే కాక రాష్ట్రంలో గుర్తింపు సాధించారు. తొలుత కమాన్‌బజార్‌లో నేత్రనిధి కార్యాలయం ఉండగా.. ఖమ్మం జనరల్ ఆస్పత్రినే ప్రత్యేక భవనాన్ని అధికారులు కేటాయించారు. దీంతో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. 'నేత్రదానం – శ్రేష్ఠ దానం' నినాదంతో మరణించిన వారి కుటుంబీకులను కలిసి నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. తద్వారా మరణించిన వారి నేత్రాలను సేకరించి కార్నియా అంధత్వం ఉన్న వారికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నారు.

ఐదు వేల మంది నుంచి సేకరణ

కంటిచూపు కోల్పోయిన వారిలో కాంతిరేఖలు నింపుతున్న ఖమ్మం నేత్రనిధి సంస్థ ఇప్పటి వరకు 5వేల మంది నుండి 10 వేల నేత్రాలు(కార్నియా) సేకరించడం విశేషం. సహజంగా వ్యక్తులు కన్నుమూసిన ఆరు గంటల్లోగా కార్ని యా సేకరించి ప్రత్యేకంగా భద్రపరుస్తారు. అయి తే, కొందరు మాత్రం కళ్లు మొత్తం తొలగిస్తారనే అపోహతో నేత్రదానానికి ముందుకు రావడం లేదు. దీంతో మరణించిన వారి కుటుంబీకులను కలిసి కంటి నల్లగుడ్డుపై అడ్డంగా ఉండే పొర (కార్నియా) మాత్రమే సేకరిస్తామని అవగాహన కల్పిస్తారు. సేకరించిన కార్నియాను హైదరాబాద్‌లోని అపోలో, అగర్వాల్, ఎల్‌వీ ప్రసాద్ తదితర ఐ బ్యాంకులకు పంపించి కార్నియా అంధత్వం ఉన్న వారికి అమర్చేలా కృషి చేస్తున్నారు. దీంతో చూపు లేని ఎందరో జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. కాగా, ఎయిడ్స్, బ్లడ్ కేన్సర్, కామెర్ల వ్యాధులతో మరణించిన వారి కార్నియా మాత్రం పనికిరాదని వైద్యులు వెల్లడించారు.

అన్ని ప్రాంతాలకు సేవలు విస్తరించాం..



తొలుత ఖమ్మంలో నేత్రాలు సేకరించగా.. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లానే కాక మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల నుంచి కూడా నేత్రాలను సేకరిస్తున్నాము. సేకరించే కార్నియాను హైదరాబాద్ పంపి అంధత్వం ఉన్న వారికి చూపు దక్కేలా కృషి చేస్తున్నాం. ఖమ్మం నేత్రనిధి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందటం ఆనందంగా ఉంది. నేత్రదానంపై అపోహలను విడనాడి అందరూ ముందుకు రావాలి.

– ఆర్.అనంత పద్మనాభం, ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి

క్లుప్తంగా...



సంద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు..

అల్లూరు: సముద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు ఉన్న సుడిగాలి రూపం నెల్లూరు తీర ప్రాంతంలో అబ్బురపరిచింది. ఈ టోర్నడో అల్లూరు మండలంలోని తాటిచెట్లపాలెం బీచ్‌లో కనిపించింది. ఆకాశంలో నిర్దిష్ట ప్రదేశంలో పీడనం ఏర్పడినపుడు సమీపంలోని సముద్రం నీటిని గాలి పైకి లాగడంతో ఆ దృశ్యం ఆవిష్కృతమైందని నిపుణులు చెబుతున్నారు.

భద్రాద్రి రాములోరి కల్యాణానికి చీరాల గోటి తలంబ్రాలు

చీరాల: భద్రాద్రి సీతారాముల కల్యాణ క్రతువులో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తలంబ్రాలలో వినియోగించే బియ్యాన్ని గోటితో ఒలిచి స్వామివారికి సమర్పించే అవకాశం క్షీరపురిగా పిలిచే చీరాల వాసులకు వరుసగా తొమ్మిదోసారి దక్కింది. ఈ మహాసంకల్పానికి చీరాలకు చెందిన సిద్ధాంతి పి.బాలకేశవులు, మరికొందరు పూనుకుని నియమనిష్టలతో నిర్వహిస్తున్నారు. చీరాలలో శ్రీ రఘురామ భక్తసేవా సమితి 2011లో 11మందితో ఏర్పాటైంది. వీరికి భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవానికి తలంబ్రాలు అందించే అవకాశం పూర్వజన్మ సుకృతంలా వచ్చింది. తలంబ్రాల కొరకు వడ్లను ఎంతో శ్రమంచి ఒలిచి, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో కలిపి.. నియమనిష్టలతో, శాస్త్రోక్తంగా తలంబ్రాలు చేస్తారు. విజయదశమి నుంచి ప్రారంభించి ఉగాది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2015 అక్టోబర్ 23న చేపట్టిన ఈ మహా కార్యక్రమంలో.. ఏటా వందలాది భక్తులు పాల్గొంటున్నారు.

గేమ్ ఛేంజర్



పారిశ్రామికాభివృద్ధిలో జీఐఎస్ కీలక మలుపు

- రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి
- శాసన సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు



సాక్షి, అమరావతి: రేపటి తరాల భవిష్యత్, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పరితపిస్తున్న, శ్రమిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏపీలో ఉన్న అపార వనరులను సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నారని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'(ఏపీ జీఐఎస్)పై శాసనసభలో శనివారం స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ఈ చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆ సదస్సులో రూ.13,11,468 కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ క్రమంలో 6,07,383 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిలో జీఐఎస్ గేమ్ ఛేంజర్ అని కొనియాడారు.

వ్యూహాత్మక విధానాలతో విజయం

'రాష్ట్ర ప్రభుత్వం సమ్మిట్ నిర్వహించడానికి ముందు రోడ్‌షోలు, వివిధ దేశాల దౌత్యవేత్తలతో సమావేశాలు, కర్టెన్‌రైజర్ కార్యక్రమాలు నిర్వహించాం. తద్వారా తీసుకున్న చర్యలు, వ్యూహాత్మక విధానాల ద్వారా విజయం సాధించాం. రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పే వారి కోసం వైఎస్సార్ వన్ కింద 23 శాఖలకు సంబంధించి 96 క్లియరెన్స్‌లు 21 రోజుల్లో ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది ఏపీ ప్రభుత్వమే. రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 48 వేల ఎకరాల భూమి పరిశ్రమలు నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం కూడా మాదే. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం జగన్ ఎంఎస్‌ఎంఈలకు రీస్టార్ట్, ఇతరత్రా చర్యలతో ప్రాధాన్యం ఇచ్చారు. తద్వారా 13 లక్షల మందికిపైగా ఉపాధి లభించింది. మూడేళ్లలో రూ.56 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 111 భారీ పరిశ్రమలు తీసుకొచ్చాం. వీటిలో 73 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. మరో 88 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి'అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. '2017లో చంద్రబాబు రూ.85,571 కోట్ల ఎంవోయూలు చేసుకుని 45,895 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పినప్పటికీ ఎవరికీ ఉద్యోగాలు రాలేదు. 2018లో రూ.67,115 కోట్లతో ఎంవోయూలు చేసుకుంటే ఇందులో కూడా ఉద్యోగాలు జీరోనే'అని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అది అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కాదు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- నాలుగు కోట్ల ఓటర్లలో.. ఇప్పుడు ఓటు వేసింది ఎనిమిది లక్షలే



సాక్షి, అమరావతి: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం ప్రతిబింబించవంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి కొట్టిపారేశారు. ఏపీలోని నాలుగు కోట్ల మంది ఓటర్లలో మూడు పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది లక్షల మంది ఓటర్లు ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఫలితాలతోనే తాము బలం పుంజుకున్నామని.. ఏదో జరిగిపోతుందని టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. శనివారం ఆయన వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పీడీఎఫ్, వామపక్షాల ఓట్లతోనే..

'గతంలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు, పీడీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల యూనియన్‌లు, ఇతర యూనియన్‌లు పోటీ చేస్తే.. వాటికి రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ఈసారి మూడు పట్టభద్ర, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపాం. ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీని ఆదరించి, రెండు స్థానాల్లోనూ గెలిపించారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇదే ప్రథమం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి పీడీఎఫ్, వామపక్షాలు ఓట్లేయించడం వల్లే ఆ పార్టీ గెలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎన్నికల ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు టీడీపీ అభ్యర్థి ఓట్లలో కలిపారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం'అని సజ్జల తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని స్పష్టంచేశారు. 2019 ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఓటుకు కోట్లు తరహాలో బాబు కుట్ర

'శాసనసభలో టీడీపీకి సాంకేతికంగా 23 మంది సభ్యులు ఉన్నప్పటికీ.. అందులో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానానికి టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించారు. గతంలో తెలంగాణలో సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి.. నోట్ల కట్టలతో సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో టేపులతో చంద్రబాబు పట్టుబడ్డ విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే రీతిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు కుట్రలు చేయొచ్చు' అని సజ్జల పేర్కొన్నారు.



సీఎం జగన్‌తో ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన నూతన ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో శనివారం నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నర్తు రామారావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని సీఎం జగన్ అభినందించారు. శాసనమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన సీఎంకు నూతన ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో ప్రాధాన్యత ఓటుతో గట్టెక్కిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం/చిత్తూరు కలెక్టరేట్/ సాక్షి, విశాఖపట్నం: తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండవ ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 7,543 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ రావడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి పాలయ్యారు. చివరి రౌండులో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు వచ్చిన 19వేల పైచిలుకు ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సందర్భంగా టీడీపీకి మెజార్టీ వచ్చింది. బీజేపీ అభ్యర్థి నగనూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీకి వచ్చాయి. కాగా, అనంతపురంలోని కౌంటింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులు తిష్ట వేయడంతో తొలి నుంచి అనుమానాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఈ అనుమానాలు నిజమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చెందిన ఓట్లు కొన్ని తెలుగుదేశం పార్టీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్స్ వరకు మాత్రమే లెక్కిస్తామని అధికారులు చెప్పారు. తూర్పు రాయలసీమలో, ఉత్తరాంధ్రలోనూ పీడీఎఫ్ ఓట్ల వల్లే టీడీపీ అభ్యర్థులు గట్టెక్కగలిగారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ (తూర్పు రాయలసీమ)గా టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు.

ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చెప్పారు. తనకు వచ్చిన ఓట్లను చాలావరకు టీడీపీ అభ్యర్థి ఖాతాలో కలిపారని, ఇందుకు కొందరు అధికారులు సహకరించారని తెలిపారు. మూడో రౌండు నుంచే తమకు కౌంటింగ్ ప్రక్రియపై అనుమానాలు వచ్చాయని చెప్పారు. ఈ అనుమానాలు 8వ రౌండులో ధృవపడ్డాయన్నారు. మొదటి రెండు రౌండ్లలో వెయ్యి వరకు మెజారిటీ వచ్చిందని, ఆ తర్వాత 20, 30కి పడిపోయిందని, ఎందుకిలా జరుగుతోందని అనుమానం వచ్చిందన్నారు. 8వ రౌండులో తనకు వచ్చిన ఓట్లలో ఆరింటిని టీడీపీ అభ్యర్థి బండిల్‌లో కట్టారని, ఇదే వ్యవహారం ముందు రౌండ్లలో కూడా జరిగి ఉంటుందని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని రిటర్నింగ్ ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.


క్రీడాకారిణికి నగదు బహుమతి



యజ్ఞతారెడ్డికి నగదు బహుమతి అందచేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: ప్రపంచ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మండలంలోని చొప్పకట్లపాలెంకు చెందిన యరమల యజ్ఞతారెడ్డికి శనివారం నాయకులు నగదు బహుమతి అందజేశారు. ఈమేరకు డీసీసీబీ డైరక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, నాయకుడు డాక్టర్ కోటా రాంబాబు తదితరులు శనివారం యజ్ఞతారెడ్డి, ఆమె తల్లిదండ్రులు విజయనిర్మల-శ్రీనివాసరెడ్డిని సన్మానించి రూ.15వేల నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు శీలం వెంకట్రామిరెడ్డి, గూడూరు రమణారెడ్డి, రత్నాలరెడ్డి, పోతురాజు వెంకటేశ్వర్లు, కటికల సీతారాంరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, వెన్నపూస శ్రీనివాసరెడ్డి, బాబురావు, లింగారెడ్డి, మాధవ్‌రెడ్డి, రంగారెడ్డి, యర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తితో పాటు రక్షణ కూడా ప్రధానమే..




బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లిరూరల్: ఆర్థిక సంవత్సరం త్వరలో ముగియనున్న నేపథ్యాన నిర్దేశిత లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేస్తూనే రక్షణ చర్యలు పాటించాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని ఈపీసీ, సీహెచ్‌పీలను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సమీప ప్రాంత ప్రజలకు శబ్దం, కాలుష్యం ఎదురుకాకుండా ఓసీ హద్దుల వెంట మొక్కలు నాటాలని సూచించారు. అలాగే, సమంత సీహెచ్‌పీలో బొగ్గు దుమ్ము లేవకుండా చూడాలని, రోజుకు 46వేల టన్నుల బొగ్గును రవాణా చేయాలని తెలిపారు. ఏరియా జీఎం జక్కం రమేష్‌తో పాటు అధికారులు వై.రఘురామిరెడ్డి, వెంకటాచారి, శ్రీనివాస్, నర్సింహారావు, కృష్ణయ్య, రమణారెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

స్పీడ్‌పోస్టులో 'భద్రాద్రి' తలంబ్రాలు

- ఈనెల 28వ తేదీలోగా బుకింగ్‌కు అవకాశం
- అన్ని పోస్టాఫీసుల్లో మొదలైన బుకింగ్



ఖమ్మంగాంధీచౌక్: దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలంలో శ్రీరామనవమికి శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ కల్యాణోత్సవం సందర్భంగా శ్రీసీతారాములకు సమర్పించే కల్యాణ తలంబ్రాలకు భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కానీ వివిధ కారణాలతో కల్యాణానికి హాజరుకాలేని భక్తులకు ఇంటివద్దే తలంబ్రాలు అందించేందుకు తపాలా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 30 తేదీన భద్రాచలంలో కల్యాణం జరగనుండగా, తలంబ్రాలను స్పీడ్ పోస్టు ద్వారా భక్తుల ఇంటి వద్దకు చేర్చే బాధ్యతను తపాలా శాఖ స్వీకరించింది. ఈమేరకు అంతరాలయ అర్చన కల్యాణ తలంబ్రాలు రూ.450, ముత్యాల తలంబ్రాల కోసం రూ.150 పోస్టాఫీసుల్లో చెల్లిస్తే భక్తులకు అందజేస్తారు. ఈ విషయమై భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అధికారులు, తపాలా శాఖ నడుమ ఒప్పందం కుదిరిన నేపథ్యాన ..ఆసక్తి ఉన్న భక్తులు ఈనెల 28వ తేదీలోగా బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఆర్టీసీ కార్గో ద్వారా కూడా తలంబ్రాల చేరవేత



ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ అధికారులు కార్గో ద్వారా భక్తులకు చేరవేయనున్నారు. ఈమేరకు రూ.116 చెల్లించి బుక్ చేసుకుంటే ఇంటి వద్దే తలంబ్రాలు అందచేస్తామని టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో ఖమ్మం, వరంగల్ జిల్లాల బాధ్యుడు వేణుగోపాల్, కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈమేరకు బుకింగ్ కోసం ఖమ్మం(91542 98583, 91542 98582, 87905 30478), మధిర(91542 98584), సత్తుపల్లి(91542 98585), కొత్తగూడెం(91542 98587, 91542 98599, 91542 98600), మణుగూరు(91542 98588), భద్రాచలం(91542 98586), పాల్వంచ(93473 40036), ఇల్లెందు(73969 12533), టేకులపల్లి(87907 26191), చంద్రుగొండ (85558 84637), ఏన్కూర్(90590 31523) నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి..



పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దే అందించాలని నిర్ణయించాం. పుణ్యక్షేత్రాన్ని సందర్శించలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– బి.రవికుమార్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

ఖమ్మం చేరిన 'భారత్ గౌరవ్' రైలు

యాత్రకు బయలుదేరిన 26 మంది



రైల్వే ఉద్యోగులు, సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంమామిళ్లగూడెం: దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా ప్రవేశపెట్టిన భారత్ గౌరవ్ రైలు శనివారం ఖమ్మం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో యాత్రికులకు ఘన స్వాగతం పలికి రైలు సిబ్బంది, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌ను సన్మానించారు. ఖమ్మం నుంచి 26 మంది యాత్రికులు ఈ రైలులో పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యాన దేశంలోని తూర్పు, ఉత్తర భాగంలో అత్యంత పురాతనమైన, ముఖ్యమైన పుణ్యక్షేత్రాల సందర్శనకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలులో పూరి, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ మీదుగా తొమ్మిది రోజులు పాటు పర్యటన కొనసాగుతుంది. కాగా, యాత్రికుల డిమాండ్ దృష్ట్యా వచ్చే నెల 18న మరో రైలు ఏర్పాటుచేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పీఆర్వో సీహెచ్.రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జాఫర్, స్టేషన్ మాస్టర్ జీఎం వీ.ప్రసాద్, ఏడీఎన్ బి.సింగ్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా విస్తరణ పనులు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణారెడ్డి

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమను ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ కల్యాణ్‌తో సమావేశమైన ఆయన పరిశ్రమ విస్తరణ పనులపై చర్చించారు. పనులు త్వరగా పూర్తి చేయించి, సీజన్ ప్రారంభం నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

వనరుల సేకరణకు ప్రాధాన్యత



లక్ష్యాలను సాధించిన పీఏసీఎస్ చైర్మన్లు కృష్ణయ్య, వెంకట్రావును సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, అధికారులు

- డిపాజిట్ల సేకరణను ప్రోత్సహిస్తేనే ఫలితాలు
- డీసీసీబీ మహాజన సభలో చైర్మన్ నాగభూషణం
- ఎరువుల ధరలు, నాణ్యతపై ప్రశ్నించిన సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ, పీఏసీఎస్‌ల ద్వారా వనరుల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో 122వ మహాజన సభ జరగగా.. సభకు అధ్యక్షత వహించిన చైర్మన్ మాట్లాడుతూ నాబార్డ్ నిబంధనల ప్రకారం స్వల్పకాలిక రుణాల కోసం రాష్ట్ర సహకార బ్యాంక్ 70 శాతం సమకూరుస్తుండగా, మిగతా నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు రైతుల పంట రుణాలకు ప్రాధాన్యం ఇస్తూనే డిపాజిట్ల సేకరణను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డీసీసీబీ పరిధిలోని 97 సహకార సంఘాలు ధాన్యం సేకరణలో రూ.645.25 కోట్ల వ్యాపారం చేసి రూ.10.45 కోట్ల కమీషన్ ఆర్జించాయని తెలిపారు. ఇక 98 సంఘాలు రూ. 82.60 కోట్ల మేర ఎరువుల వ్యాపారంతో రూ.0.81కోట్లు, 96 సంఘాలు రూ.31.01 కోట్ల విలువైన విత్తన వ్యాపారంతో రూ.0.25 కోట్ల కమీషన్ సాధించాయని చెప్పారు. అనంతరం సీఈఓ రానున్న ఆరు నెలల కాలానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, బ్యాంకు బైలా సవరణ, ఉద్యోగుల సర్వీసు నిబంధనల అమలుపై తీర్మానాలను ఆమోదించారు. కాగా, పలు పీఏసీఎస్‌ల అధ్యక్షులు మార్క్‌ఫెడ్ అందిస్తున్న ఎరువుల నాణ్యత, ధరలలపై అభ్యంతరం చెప్పగా.. మార్క్‌ఫెడ్ డీఎం సునీత సమస్యను ప్రధాన కార్యాలయం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఇక అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, బూర్గంపాడు పీఏసీఎస్ పరిధిలో 430 మంది రైతులు పోలవరం ప్రాజెక్టు కింద భూమి కోల్పోయినందున వారు బకాయి ఉన్న రూ. 1.50 కోట్ల రుణంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సంఘం లావాదేవీల ఆధారంగా గౌరవ వేతనం

ప్రభుత్వం, కో–ఆపరేటివ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం పీఏసీఎస్‌ల లావాదేవీల ఆధారంగా అధ్యక్షులకు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. రూ.5 కోట్ల లావాదేవీలు ఉంటే నెలకు రూ.5 వేలు, రూ.10 కోట్లు దాటితే రూ.7,500, రూ.15 కోట్ల లావాదేవీలకు రూ.10 వేలు, రూ.25 కోట్ల లావాదేవీలు కలిగిన సంఘాల అధ్యక్షులకు రూ.12,500లు, రూ.25 కోట్లు దాటిన సంఘాల అధ్యక్షులకు రూ.15 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే, వంద శాతం అప్పులు, రుణ వాయిదాలు వసూలు చేసిన సత్తుపల్లి, మండ్రాజుపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు చల్లగుళ్ల కృష్ణయ్య, తోట వెంకట్రావుతో పాటు డైరెక్టర్లుగా ఇటీవల ఎన్నికైన మోదుగు పుల్లారావు, నూకల సైదులును డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, డైరెక్టర్లు, అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాయల వెంకట శేషగిరిరావు, కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా వ్యవసాయాధికారి యం విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.32.99 లక్షలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెంజిల్లా పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈమేరకు 110రోజులకు గాను రూ.32,99,472 ఆదాయం నమోదైందని దేవాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. అలాగే, విదేశీ నోట్లు, మిశ్రమ వెండి, బంగారం లభించాయని పేర్కొన్నారు. ఆలయ మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ పి.మదన్‌మోహన్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం